# సింగిల్ పేజీ కథలు

## బాంధవ్యం

విపరీతమైన జ్వరంతో బాధపడుతున్నాడు వాసుదేవ్. అనుకోకుండా అతనికి ఆరోజు విపరీతమైన టెంపరేచర్ వచ్చింది. బెడ్‌పై నుండి లేవలేకుండా ఉన్నాడు.

'ఈరోజు తను డ్యూటీకి వెళ్లలేడు. ఒళ్లంతా నొప్పులతో జ్వరం విపరీతంగా ఉంది. ఈరోజు తను అర్జంటుగా చేయవలసిన ఆఫీస్ వర్క్ ఏమైనా ఉందా? ఉంది. అయినా తను ఈ రోజు ఆఫీస్‌కి వెళ్లలేడు' అనుకుంటూ ఆలోచిస్తున్నాడు వాసుదేవ్.

వాసుదేవ్ విద్యుత్‌శాఖలో ఆఫీసర్ హోదాలో ఉన్న బాధ్యతగల ఉద్యోగి. అతని భార్య ఉషారాణి కూడా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసర్. ఇద్దరు పిల్లలు కాన్వెంటులో చదువుతున్నారు.

"ఏమిటండీ ఈరోజు మీరింకా లేవనేలేదు. ఆఫీస్‌కి వెళ్లరా ఏమిటి?" అంటూ భార్య ఉషారాణి వాసుదేవ్‌కి దగ్గరగా వచ్చింది.

"లేదు ఉషా! బాగా జ్వరంగా ఉంది. ఈరోజుకి నేను డ్యూటీకి వెళ్లలేను. ఆఫీస్‌కి లీవ్ పెడతాను" అన్నాడు వాసుదేవ్ నీరసంగా.

"సరే మీ ఇష్టం" అంటూ బాత్ రూం వైపు వెళ్లిపోయింది ఉషారాణి.

వెంటనే వాసుదేవ్ ఆలోచనలు ఉషారాణి వైపు మళ్లాయి.

'తన భార్య ఉష ఒక పెద్ద ఆఫీసర్. తనో పెద్ద హోదాలో ఉన్నదని ఆమె ఎప్పుడూ భావిస్తూ ఉంటుంది. ఉద్యోగం చేయని స్త్రీలపై చిన్నచూపు. తక్కువ హోదా ఉద్యోగం చేసే వారిపై కూడా చిన్నచూపే. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆఫీసుకు వెళ్లడం, తను ఉద్యోగం చేస్తుంది కాబట్టి ఇంటి పనులతో, ఇంటి వ్యవహారాలతో తనకు సంబంధం లేనట్లు వ్యవహరించడం ఆమెకు అలవాటైపోయింది. ఆమె ఉద్యోగ విషయాలలోపడి భర్తను పిల్లలను కూడా అంతగా పట్టించుకోదు. ఇంటిలో పనిచేయడానికి ఒక మనిషి, వంట చేయడానికి మరొక మనిషి. తనకు భార్యతో సరదాగా గడుపుదామని ఉంటుంది కానీ ఆమె ఆ అవకాశమే తనకు ఇవ్వదు' మనసులోనే అనుకుంటున్నాడు వాసుదేవ్.

మరికాసేపటికి వాసుదేవ్ జ్వరం మరీ ఎక్కువైంది.

'జ్వరం చూస్తే చాలా ఎక్కువగా ఉంది. ఒక్కడినే హాస్పటల్‌కు వెళ్లడం కూడా చాలా కష్టం. చాలా నీరసంగా కూడా ఉంది. ఈరోజు ఉష కూడా సెలవుపెట్టి ఇంట్లో ఉంటే బావుంటుంది. కాస్త తోడుగా ఉన్నట్లుగా ఉంటుంది' అని మనసులో అనుకుంటూ- భార్య ఉషను కూడా సెలవు పెట్టమని అడుగుదామనుకున్నాడు వాసుదేవ్. కానీ ఆమె అందుకు అంగీకరించదని వాసుదేవ్‌కు బాగా తెలుసు. గతంలో అటువంటి అనుభవం అతనికి చాలాసార్లు ఎదురైంది. అందువలన వాసుదేవ్ తన ప్రయత్నం విరమించుకొని మిన్నకుండిపోయాడు.

"నేను ఆఫీసుకు వెళుతున్నానండీ! అయితే ఈరోజుకు మీరు డ్యూటీకి వెళ్లనట్టేగా" అంటూ ఆఫీస్‌కి వెళ్లిపోయింది ఉషారాణి.

* * *


ఉషారాణి ఆఫీసుకు వెళ్లి తన సీటులో కూర్చుంది. ఇంతలో క్లర్క్ కళ్యాణి వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసింది.

"కళ్యాణీ! ఏమిటి నిన్న ఆఫీసుకు సెలవు పెట్టావ్?" అంది ఉషారాణి.

"అవును మేడమ్. నిన్న మావారికి ఒంట్లో బావుండలేదు. జ్వరం వచ్చింది. అసలు బెడ్‌మీద నుండి లేవలేక పోయారు. దాంతో నేను చాలా కంగారుపడ్డాను. ఆయన పరిస్థితి చూస్తే నాకు చాలా జాలివేసింది. ఇక ఆఫీసుకి రావాలనిపించలేదు. వెంటనే ఆయనను హాస్పిటల్‌కు తీసుకు వెళ్లాను. నిన్న సాయంత్రానికి కొంచెం రిలీఫ్ అనిపించింది" వివరిస్తూ చెప్పింది కళ్యాణి.

"అయితే మాత్రం ఆఫీసులో ఇంత బిజీగా ఉంటే నువ్వు సెలవు పెట్టడమేమిటి?" కాస్త తీవ్రమైన స్వరంలోనే అంది ఉషారాణి.

"అదేమిటి మేడమ్! విషయం మీకు వివరించి చెప్పాను కదా! తప్పనిసరి పరిస్థితులలో లీవ్ పెట్టాల్సి వచ్చింది" బదులిచ్చింది కళ్యాణి.




"నువ్వు లీవ్ పెట్టడానికి కారణం విన్నాను కదా! అంతమాత్రానికే లీవ్ పెట్టేయ్యాలా? అలా అనుకుంటే ఈరోజు మా హజ్బెండ్‌కి కూడా జ్వరంగా ఉంది. నేను లీవ్ పెట్టానా? ఆఫీస్‌కి రాలేదా?" అంది ఉషారాణి.

ఉషారాణి మాటలకు కళ్యాణికి చాలా కోపమొచ్చింది.

"అదేమిటి మేడమ్ అలా మాట్లాడుతారు? అందరి మనస్తత్వం ఒకేలా ఉండదు కదా! మా వారికి జ్వరం వస్తే నేను చాలా ఆందోళన చెందాను. మీ హజ్బెండ్‌కి జ్వరం వస్తే మీకు ఏమీ అన్పించకపోవచ్చు. మీలో ఎటువంటి ఆందోళనా, కంగారు ఉండకపోవచ్చు. మీరు మామూలుగానే ఉండవచ్చు. దానిని మీరు చాలా తేలికగా తీసుకోవచ్చు. కానీ నా మనస్తత్వం వేరు. మావారికి జ్వరంగా ఉంటే దానిని నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. దానికి నా మనస్తత్వమే కారణం. అయినా కుటుంబంలో వ్యక్తుల మధ్య అనురాగం, ప్రేమ, సానుభూతి, జాలి, దయ, మమకారం అనేవి ఉండాలి కానీ అవి లేకపోతే అది కుటుంబమెలా అవుతుంది? హాస్టల్ రూం అవుతుంది. లేకుంటే అదీ ఆఫీసే అవుతుంది. జీవిత భాగస్వామి అన్న తర్వాత అతని కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి కదా! మనం ఉద్యోగం చేస్తున్నది సుఖంగా జీవించడం కోసంగానీ ఉద్యోగమే జీవితం కాదు గదా! ఉద్యోగం జీవితంలో ఒక భాగం మాత్రమే అని నా విశ్వాసం" అంటూ విసురుగా అక్కడి నుండి వెళ్లిపోయింది కళ్యాణి.

చెంపపై ఛెళ్లున కొట్టినట్లుగా ఫీలయ్యింది ఉషారాణి. తనకు తనే ఆత్మవిమర్శ చేసుకోసాగింది.

'కళ్యాణి చెప్పిన మాటలు అక్షరాలా నిజం. కుటుంబ బాంధవ్యానికి సరైన అర్థం చెప్పింది. తనెప్పుడూ అలా ఆలోచించలేదు. ఈరోజు తన భర్త జ్వరంతో బెడ్‌పై నుండి లేవలేని పరిస్థితిలో ఉంటే తను మామూలుగానే ఆఫీసుకి వచ్చేసింది. ఆఫీసు బాధ్యతలు అవసరమైనవే కానీ కుటుంబ వ్యక్తుల మధ్య అదీ జీవిత భాగస్వామితో అన్యోన్యత మరీ అవసరం. ఈరోజునుండీ తను కూడా జీవిత భాగస్వామిని, ఇతర కుటుంబసభ్యులనూ పట్టించుకోవాలి. ఈరోజు తన భర్త జ్వరంతో ఏం బాధపడుతున్నారో' అనుకుంటూ ఒక వైట్ పేపర్ తీసి ఆ మరుసటి రోజుకి లీవ్‌లెటర్ వ్రాసి టేబుల్‌పై పెట్టింది ఉషారాణి.

-జి.మేరీకృపాబాయి (మచిలీపట్నం)